
క్లుప్తంగా

శాకంబరి అలంకారంలో శ్రీలక్ష్మీ అమ్మవారు



దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఈ నెల 23 వరకు అమ్మవారికి వివిధ అలంకారాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

మాచర్ల: భారతదేశానికి అబ్దుల్ కలాం ఎంతో ఆదర్శవంతమైన మహనీయుడని అధికారులు ఆయన సేవలను కొనియాడారు. ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారిలో అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని అబ్దుల్ కలాం సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, ఆర్యవైశ్య పెద్దలు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, చందోలు నాగేశ్వరరావు, పాషావలి నివాళులర్పించారు.

చక్రధర్ డిగ్రీ కళాశాలలో..

స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో స్వర్గీయ అబ్దుల్ కలాం చిత్రపటానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

స్వామి వివేకానంద అనాథాశ్రమంలో ..

పట్టణంలోని స్వామి వివేకానంద అనాథాశ్రమంలో కేసీపీ జనరల్ మేనేజర్ వెంకటరమణ, రూరల్ సీఐ షేక్ షమీముల్లా, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, పట్టణ ఎస్ఐ సుందర రాజన్, వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ రామకోటయ్య శాఖాధికారులతో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి తదితరులున్నారు.

అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శం

పిడుగురాళ్ల: ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు ఆదర్శమని జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ జంగా మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి ఎంతో ఉన్నతమైన శిఖరాలకు అబ్దుల్ కలాం ఎదిగారన్నారు. ప్రతి ఒక్కరు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాయకులు సుబ్బయ్య, దాచేపల్లి కౌన్సిలర్ షరీఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రులు



పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు



రెంటచింతలలో బాలాత్రిపుర సుందరీదేవిగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



మెయిన్‌బజార్‌లో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారు

గురజాల : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం పలు దేవాలయాల్లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవార్లు పలు అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో సర్వాంగ రజిత కవచధారణ అలంకరణలో, శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో బాలా త్రిపుర సుందరి అలంకరణలో, శ్రీ కనకదుర్గా అమ్మవారి దేవాలయం, లక్ష్మీటాకీస్ సెంటర్‌లో ప్రత్యేక మండపాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

దాచేపల్లి : దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ప్రాంభమయ్యాయి. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. దాచేపల్లిలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం, నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద శ్రీ కనకదుర్గమ్మదేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పల్లపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మ తల్లి దేవాలయంలో పూజలు చేశారు.

మాచర్ల: దసరా నవరాత్రులలో భాగంగా ఆదివారం పట్టణంలోని దేవాలయాలలో అమ్మవార్లు వివిధ అవతారాలలోదర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా పాత మాచర్లలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బాలా త్రిపురసుందరి, సొసైటీ కాలనీలోని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి, కేసీపీకి వెళ్ళే దారిలో, నగరేశ్వర స్వామి గుడిలో, రోప్‌వే కాలనీ, 13వ వార్డులోని కనక దుర్గ అమ్మవారు, చంద్రవంక బ్రిడ్జి ఆదిలక్ష్మి, వీరభద్ర స్వామి గుడిలో అష్టలక్ష్మి, 13వ వార్డులో సాయిబాబా గుడిలో లలితమ్మలను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని ప్రధాన రహదారి ప్రాంతంలోని కోదండ రామాలయంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారు, శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అమ్మవారి ఆలయాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని కనక దుర్గ అమ్మవారి దేవస్థానంలో శరనవరాత్రులలో భాగంగా అమ్మవారిని బాలత్రిపుర సందరి దేవిగా అలంకరించారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో అమ్మవారికి చండీ హోమం, అమ్మవారికి చండీ అమ్మవారు, నవదుర్గ కలశాల అలంకరణ నిర్వహించారు. అలాగే శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

రెంటచింతల: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో అమ్మవార్ల దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, సత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ భ్రమరాంబిక అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరిదేవి అలంకారంలో పూజలు అందుకున్నారు. సత్రశాల దేవస్థానంలో హోమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. పాలువాయి జంక్షన్ వద్దశ్రీకనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో, లక్ష్మీదేవి అమ్మవారు ఆదిలక్ష్మీదేవి అలంకారంలో, సరస్వతిదేవి అమ్మవారు బాలాదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. స్థానిక చౌడేశ్వరి అమ్మవారు దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షులు యేచూరి సాంబశివరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజయపురిసౌత్: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక శ్రీ కనకదుర్గా వెంకటేశ్వర ఆలయం, మెయిన్‌బజార్‌లోని అమ్మవారు ఆదివారం శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాలలో అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు, సాయి ప్రశాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజలు, సహస్త్రనామ పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గా వెంకటేశ్వర ఆలయంలో రెంటపాళ్ళ గోపికృష్ణ, గౌతమి దంపతులు, మెయిన్ బజార్‌లోని అమ్మవారి విగ్రహం వద్ద గ్రంధి కొండలు, రంగమ్మ దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. శ్రీకనకదుర్గా వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు, భవానీ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దేవి నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానది లో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో ఆదివారం మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ వారి సహకారంతో సుమారు 100 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి 75 మందిని ఆపరేషన్ నిమిత్తం నంద్యాల తీసుకెళ్ళినట్లు తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేసి కళ్ళజోళ్ళు అందజేస్తారన్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, సెక్రటరీ పందిరి నరసింహారావు, కోశాధికారి ముప్పవరపు నాగార్జున, జాయింట్ సెక్రటరీ బచ్చు రాజ్‌కుమార్, చుండూరు సత్యనారాయణ, నేరెళ్ళ నాగేశ్వరరావు, అర్జున్‌రావు, వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పిడుగురాళ్ల: పట్టణంలోని అంజుమాన్ షాదీఖానాలో చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, శంకర్‌కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరంకు అనూహ్యస్పందన లభించింది. శిబిరాన్ని పట్టణ ఆర్థోపెడిక్ వైద్యులు రావిపాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మొత్తం 360 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నిర్వహించారు. అనంతరం 168 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సల నిమిత్తం పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు డాక్టర్ స్పందన, దీక్ష గుప్తా, చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు చల్లగుండ్ల శ్రీనివాసరావు, బండారు చిరంజీవి, చల్లగుండ్ల నాగేశ్వరరావు, సైదులు, జానకిరామ్, సాయిచంద, శ్రీకాంత్, శంకర్ కంటి ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి రవికాంత్, రవికుమార్, పారామెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నియోజకవర్గ కన్వీనర్‌గా బయ్యన్న నియామకం

దాచేపల్లి : ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంఘం గురజాల నియోజకర్గం కన్వీనర్‌గా నారాయణపురంకు చెందిన బత్తుల బయ్యన్న నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీర్ ధర్మరాజు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం బయ్యన్నకు ఆదివారం నియామక పత్రం అందజేశారు. వడ్డెర్ల అభివృద్ధి కోసం కృషి చేస్తానని, రాజకీయంగా, ఆర్థికంగా వడ్డెర్లను బలోపేతం చేసేందుకు పని చేస్తానని బయ్యన్న చెప్పారు. వడ్డెర సంఘం కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నారాయణపురంకు చెందిన తమ్మిశెట్టి రామకృష్ణ నియమితులయ్యారు. బయ్యన్న, రామకృష్ణను వడ్డెర సంఘం నేతలు అభినందించారు.

ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పణ



బోనాలతో ఊరేగింపుగా తరలివస్తున్న గ్రామస్తులు

మాచవరం: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఆదివారం బోనాల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు తలపై ధరించి, మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తరలివచ్చి ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు. ఆలయంలో పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజలందరిని అమ్మవారు దీవించాలి... ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ముత్యాలమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ తల్లి ప్రజలందరిని చల్లగా దీవించి, పాడి పంటలతో, సుఖ సౌభాగ్యాలతో కాపాడాలని వేడుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి, వైస్ ఎంపీపీ నన్నే షైదా, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ గాదె కనకారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రోశయ్య, శివారెడ్డి, గురవారెడ్డి, తదితరులు ఉన్నారు.

అమ్మవారికి వెండి చీర బహూకరణ



గురజాల : పట్టణంలో వేంచేసియున్న శ్రీ పాటపాటేశ్వరి అమ్మవారికి ఆదివారం వెండి చీరను బహూకరించారు. గురజాలకు చెందిన కూరపాటి రామారావు రూ.3లక్షల 50 వేల విలువ కలిగిన వెండి చీరను అమ్మవారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వేంచేసియున్న అమ్మవారు ఎంతో మహిమ కలిగిన తల్లి అని అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. అమ్మవారి చీరను ర్యాలీగా తీసుకువచ్చి ఆలయ పూజారి పిన్నెల్లి వెంకట సుబ్రమణ్యంకు అందించారు. అనంతరం వెండిచీరను అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ చైర్మన్ కనకం ఆదినారాయణ దత్తు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, దేవదాయ ధర్మాదాయ సిబ్బంది తదితరులున్నారు.

కొండ మృతి బాధాకరం



కారెంపూడి: స్థానిక వడ్డెర బజారుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కామెర కొండ అలియాస్ కొబ్బరి చెట్ల కొండ (50) మృతి పట్ల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి (పీవీఆర్) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కొండ శనివారం సాయంత్రం మృతి చెందారు. ఆదివారం జరిగిన కొండ అంత్యక్రియలలో వెంకటరామిరెడ్డి పాల్గొని కొండ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మట్టి ఖర్చుల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మేకల శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, కామెర పిచ్చెయ్య, ఆశం వియజభాస్కరరెడ్డి, జావిద్‌లు పీవీఆర్ వెంట మృతదేహాన్ని సందర్శించి కొండ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు.

ఘనంగా 16వ వార్షికోత్సవం

గురజాల : పట్టణంలో వేంచేసియున్న శ్రీ సాయి ప్రేమ సుధ మందిరం 16వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు.స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో శాంతిహోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవాలయం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది పాల్గొని స్వామి వారి ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కనకదుర్గ ఆలయానికి ఉత్సవ విగ్రహం అందజేత

దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు ఆదివారం అందజేశారు. రూ.2.50 లక్షలు విలువ చేసే అమ్మవారి పంచలోహ విగ్రహం, పల్లకిని ఆలయ ధర్మకర్త పల్లపు వెంకటేశ్వర్లుకి అందించారు. అమ్మవారిని విగ్రహం భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. విగ్రహం అందజేసిన భక్తులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.